
06ATP04_06ATP04.qxd 04-01-2026 PM 11:24 Page 1



## నేడు హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ కార్యాలయం ముందు ధర్నా

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**



జె.సి ప్రభాకర్‌రెడ్డి

అనంతపురంలోని హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ కార్యాలయం వద్ద తాడిపత్రి, పుట్లూరు. యల్లనూరు మండలాల రైతులతో కలిసి సోమవారం ధర్నా చేయనున్నట్లు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గత పది రోజుల క్రితం జె.సి ప్రభాకర్‌రెడ్డి అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు హెచ్‌ఎల్‌సి ద్వారా నీటిని విడుదల చేయాలని విన్నవించడంతో తప్పనిసరిగా ఒక ఏఐని ఏర్పాటు చేసి నీటిని విడుదల చేస్తామని చెప్పారన్నారు. పది రోజులు గడిచినా నీటిపారుదలశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం తలపెట్టనున్నట్లు జె.సి పేర్కొన్నారు. నీరు విడుదల చేయాలని అధికారులను అడుగుతుంటే పది పదిహేను రోజుల తరువాత విడుదల చేస్తామని చెబుతున్నారని యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వారి కోసం ఎస్‌ఇ కార్యాలయం వద్ద మౌనదీక్ష చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. ఈ కార్యక్రమానికి యల్లనూరు, పుట్లూరు, తాడిపత్రి మండలాల రైతులు పెద్దఎత్తున హాజరు కావాలని జె.సి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలి

**పెద్దవడుగూరు, జనవరి 4 ప్రభాతవార్త**




వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ ఆంజనేయులు, గుంతకల్లు ఆర్టీఓ రాజా బాబు పేర్కొన్నారు. పెద్దవడుగూరు మండలం కాశేపల్లిలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ రాజాబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. ఫోర్ వీలర్ వాహనాలు కూడా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడపడం నేరమని, అలాగే మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారంతా చట్టపరంగా మోటర్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండిషన్లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. ప్రయాణంలో మొబైల్ వాడకం, మద్యం సేవించి వాహనాలు అతివేగంగా నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో క్రమ శిక్షణతో వాహనాలు నడపాలని వారు తెలిపారు.

ఆర్డీటి కబడ్డీ సెంట్రల్ లీగ్‌కు

## విజన్ హైస్కూల్ జట్టు ఎంపిక



సెంట్రల్ లీగ్‌కు ఎంపికైన కబడ్డీ జట్టు

**యాడికి, జనవరి 4 ప్రభాతవార్త**

అనంతపురంలో ఆర్డీటి, శ్రీవివేకానంద కబడ్డీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సెంట్రల్ లీగ్‌కు యాడికి విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జట్టు ఎంపికైంది. డిఎస్‌ఏ అనంతపురం జట్టు, కురుకుంట్ల జెడ్‌పిహెచ్‌ఎస్ జట్టు, ఆర్డీటి జట్టుపై వరుసగా మూడు విజయాలు సాధించి సెంట్రల్ లీగ్‌కు ఎంపిక కావడం జరిగింది. ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా జరిగాయి. యాడికి క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో జిల్లాస్థాయి కబడ్డి క్రీడా అధికారులను ఆకట్టుకున్నారు. వీరిని కోచ్ ప్రసాద్, విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించారు.

## గొడవలు పడితే కేసులు నమోదు చేస్తాం

- ఎస్‌ఐ ఆంజనేయులు



ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

**పెద్దవడుగూరు, జనవరి 4 ప్రభాతవార్త**

గ్రామాల్లో ఎవరైనా గొడవలు పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి జగదీష్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని సమస్యాత్మక గ్రామమైన చిన్నవడుగూరులో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్ల ఇళ్లను తనిఖీ చేసి ఎటువంటి గొడవలకు పాల్పడరాదని హెచ్చరించారు. అదేవిధంగా గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గొడవలు పడితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే 9440796826కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అశ్వత్థనారాయణస్వామికి పంచామృతాభిషేకాలు

**పెద్దపప్పూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన అశ్వత్థంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీఅశ్వత్థనారాయణస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అలాగే శ్రీచక్రభీమలింగేశ్వరునికి అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుబ్రమణ్యం, సిబ్బంది గుర్రప్ప, అరుణ్ పాల్గొన్నారు.



## తేనేటి విందులో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



తేనేటి విందులో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**నల్లచెరువు జనవరి 4, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జాతీయ రహదారి మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ బోయకొండ గంగమ్మ దేవాలయానికి వెళ్లి తిరిగి అనంతపురానికి వెళ్తూ పెద్ద ఎల్లంపల్లికి చెందిన తనకల్లు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అశ్వర్థ నారాయణ స్వగృహానికి, అలాగే మండల కేంద్రంలోని టిడిపి నాయకుడు డ్రిప్పు చలపతి ఇంటికెళ్లి వెళ్లి తేనేటి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు టిడిపి నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి కార్యకర్తలను పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో.. సతీష్ చౌదరి, రమేష్ నాయుడు, నాసు నరసింహులు, రాజా నాయుడు, తలుపుల నరేష్, శ్రీనివాసులు, రామకృష్ణ, బాలు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

**పెద్దవడుగూరు, జనవరి 4 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. పెద్దవడుగూరు మండలములోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం సిపిఐ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు వై.సూర్యనారాయణరెడ్డి, వడుగూరు నారాయణ, వెంకట రాముడు యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి వి.వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 36 వేలు రూపాయలు అందించి చేనేత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును అందించాలని, మర మగ్గాలు ఎత్తివేయాలని, ఉపాధి బిల్లులు తక్షణమే కూలీలకు అందించాలి, ఉపాధి పనిముట్లు ఇవ్వాలని, ఉపాధిహామీ పేరు మార్చకూడదన్నారు. పెద్దవడుగూరు మండల కేంద్రంలో పబ్లిక్ టాయి లెట్లను ఏర్పాటు చేయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రంగస్వామి, ఏఐటియుసి మండల కార్యదర్శి హుసేన్‌పీరా, రంగనాయకులు, అల్లాబకాష్, సుధాకరగౌడు, ఓంనారాయణ, ముత్యాలరెడ్డి, రామయ్య, నాగేంద్ర, మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ రంగంలో అరుదైన ఘన విజయం



ప్రతిభ చూపినవారికి రికార్డు సర్టిఫికెట్లను అందజేసిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, జనవరి 4 ప్రభాతవార్త**

మార్షల్ ఆర్ట్స్ రంగంలో తాడిపత్రి ప్రాంతానికి చెందిన లక్కీ సాయి నరసింహారెడ్డి, గౌతమ్‌కుమార్‌రెడ్డి (విక్కీ)లు తమ అద్భుతమైన స్టంట్ ప్రదర్శనతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా స్థానం సంపాదించారు. ఈ ప్రత్యేక స్టంట్ కార్యక్రమం లక్ష్మీ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ స్టంట్ ప్రదర్శనలో లక్కీ సాయి నరసింహారెడ్డి కేవలం 3.25 సెకండ్లలో 100 టైల్స్ బ్రేకింగ్ చేసి అసాధారణ ప్రతిభను చాటారు. గౌతమ్‌కుమార్‌రెడ్డి (విక్కీ) 5.59 సెకండ్లలో శరీరంపై ట్యూబ్ లైట్స్ బ్రేకింగ్ చేసి ప్రేక్షకులను, అధికారులను విస్మయానికి గురిచేశారు. ఈ కార్యక్రమానికి తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్టంట్‌ను ప్రత్యక్షంగా వీక్షించి లక్కీ సాయి నరసింహారెడ్డి, గౌతమ్‌కుమార్‌రెడ్డి చూపిన ధైర్యం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని ప్రశంసించారు. అలాగే, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కోఆర్డినేటర్ వెంకట్ ఈ ప్రదర్శనను ప్రత్యక్షంగా పరిశీలించి, అన్ని నిబంధనలు పూర్తిగా పాటించబడినట్లు నిర్ధారించిన అనంతరం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అధికారికంగా నమోదు చేసి రికార్డు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల్ స్కూల్ యాజమాన్యం శివయ్య, డాక్టర్ దాదాపీర్, ప్రముఖులు పాల్గొని అభినందించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఆర్గనైజర్ సాయి మాట్లాడుతూ ఇలాంటి రికార్డు స్థాయి స్టంట్ ప్రదర్శనలు యువతలో ఆత్మవిశ్వాసం, ధైర్యం, క్రమశిక్షణ పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్తులో ఇంకా మరిన్ని వినూత్న మార్షల్ ఆర్ట్స్ రికార్డులు సృష్టించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

## ఘనంగా రమణమహర్షి జయంతి వేడుకలు



శ్రీరమణమహర్షి చిత్రపటం వద్ద ఉపన్యాసం చేస్తున్న వివి బ్రహ్మం

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీరమణమహర్షి ఆశ్రమంలో స్వామివారి 146వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం ఆత్మవిచారణ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆశ్రమ నిర్వాహకులు వివి బ్రహ్మం ఉపన్యాసం చేశారు. అనంతరం అంధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి అనంతపురంకు చెందిన నృత్య కళానిలయము సంధ్యామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వివి బ్రహ్మం, రమణమహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై నేడు గ్రామసభలు

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**

ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచా యతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ రోజ్ గార్ మరియు ఆజీవికా మిషన్ గ్రామీన్‌గా మార్పు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పథకం పేరు మార్పు, లక్ష్యాలు, అమలు విధానం తదితర అంశాలపై గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడం కోసం ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎంపిడిఒ తెలియచేశారు.

## కేతిరెడ్డి పెద్దారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పేరం స్వర్ణలత

**తాడిపత్రిటౌన్, జనవరి 4 ప్రభాతవార్త**



పెద్దారెడ్డికి పుష్పగుచ్చం అందచేస్తున్న పేరం స్వర్ణలత

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి వైఎస్ ఆర్‌సిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆదివారం ఆమె కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పేరం అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీని కలిసిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

**తనకల్లు, జనవరి 4 ప్రభాతవార్త**



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్

తనకల్లు మండల కేంద్రంలోని తారకరామనగర్‌కు చెందిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తనకంటి శివశంకర్ ఆదివారం పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసి 2026 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను వివరిస్తూ వెంటనే 100 రోజుల్లో భాగంగా మార్కుల ఎంట్రీలో ఆలస్యానికి ఉపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని, మరియు పిఆర్‌సి ప్రకటించాలని, ఆలోపు పిట్మెంట్ 40 శాతం ప్రకటించాలని, పెండింగ్ డిఏలను ఇవ్వాలని, నిన్న తమిళనాడు ప్రభుత్వం సిపిఎస్ విధానంలో చేసిన మార్పులు మన రాష్ట్రంలో కూడా తేవాలని, సింగల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు పి.శివశంకర్, పుష్పగిరి ప్రకాష్, రామచంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

**యాడికి, జనవరి 4 ప్రభాతవార్త**

యాడికి మండల కేంద్రంలో ఆదివారం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావు సలహా మేరకు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ సూచనలతో ఆదివారం మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంఆర్‌పిఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ, ఎంఎస్‌పి మండల కన్వీనర్ గుర్రప్ప మాదిగ, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసులు మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు జి. నరసింహులు మాదిగ, సూర్యుడు మాదిగ, శ్రీరాములు మాదిగ, రామంజి మాదిగ, కుళ్లాయప్ప మాదిగ, పుల్లయ్య మాదిగ, మురళి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**

గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా వుండాలని రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తాడిపత్రి మండలం ఆలూరు గ్రామంలో ఎస్‌ఐ కాటయ్య, సిబ్బందితో కలిసి నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానాస్పద ఇళ్లు, గడ్డివాములు, కల్లందొడ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గ్రామస్తులతో మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు ఎవరూ గొడవపడరాదన్నారు. ఏవైనా సమస్యలు వుంటే పోలీసులకు తెలియచేయాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

## నేడు ఎమ్మెల్యేచే జలహారతి కార్యక్రమం

**నంబులపూలకుంట, జనవరి 4 ప్రభాతవార్త**

హంద్రీనీవా సృజల స్రవంతి ద్వారా కృష్ణా జలాలు నంబుల పూలకుంట మండలంలో చేరుకొని వంకమద్ది చెరువు పూర్తిగా నిండిన సందర్భంగా ఆదివారం ఉదయం 10:30 గంటలకు వంకమద్ది చెరువుకు జలహారతి ఇచ్చే కార్యక్రమంలో శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొననున్నట్లు ఎన్.పి.కుంట మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున మండలం కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్చార్జిలు, అన్ని అనుబంధ విభాగాలకు సంబంధించిన నాయకులు కార్యకర్తలు, ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ, కూటమి నాయకులు జల హారతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## జెడ్‌ప్లస్ భద్రత కోరిన జనార్దన్ రెడ్డి.

**బళ్లారి జనవరి 04 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

నగరంలో జరిగిన బ్యానర్ కాల్పుల ఘటన నేపథ్యంలో తనకు జెడ్‌ప్లస్ భద్రత కల్పించాలని మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ అభ్యర్థనను రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర, డీఐజీలకు కూడా సమర్పించారు. బళ్లారిలో జరిగిన కాల్పుల ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగిందని. దీనిని హత్యాయత్నంగా ఆయన అభి వర్ణించారు. బళ్లారి నగర ఎమ్మెల్యే నర భరత్ రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆరోపించిన జనార్దన్ రెడ్డి, తనకు రక్షణ కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన కుటుంబానికి అవసరమైన భద్రత కల్పించడంలో విఫలమైనందున తనపై దాడి జరిగిందని కూడా ఆయన అన్నారు.

## జాతీయ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించిన గాండ్ల సంఘం నాయకులు






జాతీయ త్రోబాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని సన్మానిస్తున్న గాండ్ల సంఘం నాయకులు

**అనంతపురంరూరల్, జనవరి 04 ప్రభాతవార్త**

గుజరాత్ లో నిర్వ హించిన 33వ జూనియర్ బాలుర మరియు బాలికల జాతీయ త్రోబాల్ ఛాంపి యన్ షిప్ 2025 పోటీల్లో అనంతపురం జిల్లా ఏరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కన బరిచారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థి రంజిత్ కు అనంతపురం రూరల్ మం డలం రాచన్నపల్లి పంచా యతీ బిఎన్ఆర్ కాలనీలో గాండ్ల సంఘం కులస్తులు ప్రతిభ కనిపించిన విద్యార్థి కి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ జాతీయ త్రో బాల్ పోటీల్లో ఏరా పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో మూడవ స్థానం, బాలికల విభాగంలో నాల్గవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కైవసం చేసుకోవడం అభినంద నీయమని తెలిపారు. త్రో బాల్ కోచస్ రాజు, సరళ ఎంతో ప్రోత్సాహం, పాఠశాల చైర్మన్ అరుణ్ కుమార్ రెడ్డి సహకారం ఎంత ఉందని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్య మని, ఆ క్రీడల వల్ల మానసికంగా, శారీరకంగా ఎదుగుతారని తెలియజేసి విద్యార్థినీ విద్యార్థులను వారు అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విద్యార్థుల ఇంతటి ప్రతిభ కనపరిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు గాండ్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు దూలం లలితమ్మ, దూలంరామ్మోహన్, అఖిల గాండ్ల తెలుగుల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు చిగిచెర్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. నరసింహుడు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కే.విజయలక్ష్మి, రాష్ట్ర మీడియా సెక్రటరీ కేపీ కుమార్, కార్యవర్గ సభ్యుడు ముత్యాల ఆదినారాయణ, అనంతపురం జిల్లా గాండ్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముకుందాపురం గంగాధర్, కోశాధికారి లక్ష్మీనారాయణ, విద్యా కమిటీ కన్వీనర్ లెక్చరర్ పార్నపల్లి రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి పార్నపల్లి రామాంజనేయులు, యువజన సంఘం జిల్లా కన్వీనర్ పసల శ్రీనివాసులు, నాగరత్నమ్మ.. సుభాషిణి, అలీమ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## బళ్లారి కాల్పుల ఘటనపై ప్రస్తుత న్యాయమూర్తితో దర్యాప్తు జరిపించాలని కేంద్ర మంత్రి సోమన్న డిమాండ్



మాట్లాడుతున్న కేంద్రమంత్రి సోమన్న

**బళ్లారి జనవరి 04 ప్రభాతవార్త:**

జనవరి 01న బ్యానర్ ఏర్పాటు విషయంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మరణించిన ఘటనపై ప్రస్తుత హైకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు జరిపించాలని రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనను రాష్ట్ర హోంమ ంత్రి దర్యాప్తు కోసం సిఐడికి అప్పగిస్తారని ఆయన ఈరోజు అన్నారు. ఇది సరైనది కాదు. మీరు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించకపోతే, దానిని సిబిఐకి అప్పగించండి. లేకపోతే, బళ్లారి నుండి అధికారంలోకి వచ్చిన మీరు మీ పరిపాలనకు చెడ్డ పేరు వస్తుందని. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మీరు దేవరాజు ఉర్స్ పదవీకాలాన్ని మించిపోతున్నారు, ఇలాంటి సమయంలో ఈ సంఘటన మీ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దు. మీరే ద్వేషపూరిత ప్రసంగ నిషేధ చట్టాన్ని అమలు చేశారు. జనార్ధన్ రెడ్డి ఇంటిని తగలబెడతానని చెప్పిన ఎమ్మెల్యే నర భరత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. భరత్ రెడ్డి మొదటిసారి ఎమ్మెల్యే. ఆయనకు ఇంకా రాజకీయ ప్రవర్తన తెలియనట్లున్నారు. అవసరమైతే, 6 నెలలు నా దగ్గరకు వచ్చిన తర్వాత అతనికి శిక్షణ ఇస్తానని చెప్పాడు. భరత్ రెడ్డి ఏ పాఠశాలలో చదివాడో తనకు తెలియదని, మాటల లో సంయమనం లేదని, ద్వేషపూరిత మాటలు మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. జనార్ధన్ రెడ్డి జెడ్ ప్లస్ భద్రత కోరుతున్నారని అడిగినప్పుడు కేంద్ర హోంమంత్రితో మాట్లాడతానని ఆయన అన్నారు. జనవరిలో కాంగ్రెస్‌కు చెడు సందేశం పంపారు, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణం బళ్లారి జిల్లా అని భరత్ రెడ్డి అన్నారు. ఈ జిల్లా గౌరవం, చరిత్ర, చరిత్రను కాపాడుకోవాలి. "ఈ సంవత్సరం మీరు ఎక్కడ ఉన్నారో చూడండి" అని పరోక్షంగా సీఎంను విమర్శించారు. రామాయణం రాసిన శ్రీ మహర్షి వాల్మీకి విగ్రహం పేరుతో మీరు పాపపు పని చేస్తున్నారు. ఆ పాపపు పనిని రాజకీయాలకు ఉపయోగించకూడదు, మీ గురించి చెప్పకూడదు. మీరు ఒక పవిత్ర వ్యక్తి పేరుతో పాపపు పని చేస్తున్నారని ఆయన అన్నారు. సతీష్ రెడ్డి ఎవరు, భరత్ రెడ్డి? మనం ఇక్కడ ఉండటానికి రాలేదు, మన పని మనం చేసుకోవాలి, వెళ్ళాలి, అంతే. శ్రీరాములు రాకపోతే జనార్ధన్ రెడ్డి కుటుంబం పరిస్థితి ఎలా ఉండేది. నా 45 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇంతటి విషాదాన్ని నేను చూడలేదు. కాంగ్రెస్ నాయకులకు చెబుతున్నాను, చాలు. వారు జనార్ధన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కాల్చడానికి వెళ్లారు. ఆ బాలుడికి ఏమైంది? రాజశేఖర్ కుటుంబం పరిస్థితి గురించి నేను అతని కుటుంబంతో మాట్లాడాను. సీఎం సిద్ధరామయ్య, మీకు ఏమైనా నైతికత ఉంటే చర్య తీసుకోండి మరియు జనార్ధన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకోకండి. మీరు చేసిన పాపాలు మిమ్మల్ని తిరిగి వెంటాడతాయి. అలాంటి వారికి ప్రాధాన్యత ఇస్తే, మీరు మీ వెన్నుముకలా తయారవుతారు. రాబోయే నాలుగైదు నెలల్లో కాంగ్రెస్ చెత్తబుట్టలా మారుతుందని ఆయన అన్నారు. మాజీ మంత్రులు జనార్ధన్ రెడ్డి, శ్రీరాములు, మాజీ ఎంపీ సన్నప్పకిరప్ప తదితరులు పాల్గొన్నారు.

## సతీష్ రెడ్డి గన్ మ్యాన్ తుపాకీ నుంచి బుల్లెట్ రాజశేఖర్ రెడ్డి శరీరాన్ని తాకింది

**బళ్లారి జనవరి 04 ప్రభాతవార్త:**

బళ్లారి నగర్ ఎమ్మెల్యే నార భరత్ రెడ్డి సన్నిహితుడు సతీష్ రెడ్డి గన్‌మ్యాన్ గురు చరణ్ సింగ్ గన్ను నుండి రాజశేఖర్ రెడ్డి శరీరంలోకి ప్రవేశించిన బుల్లెట్ అని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. జనవరి 01 రాత్రి జనార్ధన్ రెడ్డి ఇంటి సమీపంలో జరిగిన ఘర్షణ లో సతీష్ రెడ్డి అంగరక్షక గురు చరణ్ సింగ్ మరియు బల్జిత్ సింగ్ ఉన్నారు. ఆ సమయంలో, వారిపై పైకి రాళ్లు వేస్తున్నారని, రక్షణ కోసం లోడ్ చేసిన తుపాకీ గాలిలోకి కాల్పులు జరిపారు, మరియు మిస్ ఫైర్ అయ్యి రాజశేఖర్ శరీరానికి తగిలింది. అది కొంచెం దూరంగా ఉంటే, ఎమ్మెల్యే భరత్ రెడ్డి మరియు అక్కడ ఉన్న పోలీసు అధికా రి రవికుమార్ తగిలేదని చెప్తారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన సుమోటో కేసులో, 45 మందిని అదుపులోకి తీసుకున్నారు మరియు ఇద్దరు గన్‌మెన్‌లతో సహా 13 మందిని ఈ సంఘ టనలో పాల్గొన్నందుకు నమోదు చేశారు మరియు సంఘటన యొక్క వీడియో ఫుటేజ్ కోసం పరీక్షిస్తున్నారు. వారిని ఆరోగ్య పరీక్ష కోసం బిమ్స్ ఆసుపత్రికి తరలిం చారు, వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఈ ఘటనలో జనార్ధన్ రెడ్డి, ఛానల్ శేఖర్ దాఖలు చేసిన కేసులో నిందితులను అవసరమైతే అరెస్టు చేస్తామని.. దర్యాప్తుకు సహకరిస్తే వారిని అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అన్నారు.

# రైతు సమస్యల పరిష్కారమే మీ తొలి ప్రధాన్యత కావాలి

- నూతన జేడీఏ, విద్యుత్ శాఖ ఎస్ఈలకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన - ఎమ్మెల్యే సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన జేడీఏ, ఎస్ఈ - నూతన ఆశావర్కర్లకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సునీత



ఎమ్మెల్యే పరిటాల సునీతకు పుష్పగుచ్చాలు అందజేస్తున్న నూతన జేడిఏ

రామగిరి, జనవరి 4 ప్రభాతవార్త

రైతు సమస్యల పరిష్కారమే మీ తొలి ప్రధాన్యత కావాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన జేడీఏ, విద్యుత్ శాఖ ఎస్ఈలకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా నియమింపబడిన రవి కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్.ఈగా నియమింపబడిన మోసెస్ ఎమ్మెల్యేతో మర్యాద పూర్వకంగా రామగిరి మండలం వెంకటాపురంలో భేటి అయ్యారు. అనంతపురం జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని వ్యవసాయ పరిస్థితులు, అలాగే శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న మూడు మండలాల్లో విద్యుత్ సమస్యల గురించి చర్చించారు. ప్రధానంగా వ్యవసాయ పరంగా రైతులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. పంటల విషయంలో ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చే విధంగా చొరవ చూపాలన్నారు. రైతులంతా ఒకే రకం పంటలు వేయకుండా ముందస్తుగా అవగాహన కల్పించాలని జేడీఏకు సూచించారు. మరోవైపు రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్ఈ మోసెస్ కు చెప్పారు. పెండింగ్ లో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ల మంజూరు, విద్యుత్ సరఫరా విషయంలో జరుగుతున్న అంతరాయం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. మరోవైపు ఆశా వర్కర్లుగా నియమితులైన వారికి ఎమ్మెల్యే సునీత నియామక పత్రాలు అందజేశారు. రామగిరి మండలం పేరూరు పీ.హెచ్.సి, ఎం.సిపల్లి సచివాలయం పరిధిలో గరిమేకలపల్లి గ్రామానికి చెందిన పూర్ణిమకు, కనగానపల్లి మండలం పీ.హెచ్.సి, సచివాలయం పరిధిలో కనగానపల్లి గ్రామానికి చెందిన సాకే వెన్నెలకు, చెన్నేకొత్తపల్లి మండలం తూముచర్ల గ్రామానికి చెందిన బోయ సంగీతకు నియామక పత్రాలు ఇచ్చారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం విషయంలో ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు.

# నేడు వీబీ-జీ రామ్ జీ చట్టం, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపై గ్రామసభలు

-మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్

వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం (వీబీ-జీ రామ్ జీ చట్టం 2025) పై అవగాహనతోపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అంశాలపై చర్చించడానికిగాను సోమవారం మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ గ్రామసభలు జరుగుతాయని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బి.వి.రవిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు చారిత్రాత్మకమైన కొత్త చట్టాన్ని ఆమోదించిందని ఇప్పటివరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో అమలులోకి తెచ్చిందన్నారు. గ్రామీణ ఉపాధిని బలోపేతం చేయడం, జీవనోపాధిని వైవిధ్యపరచడం, సామాజిక-ఆర్థిక సాధికారణ పెంపొందించడం ఈ చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. అదేవిధంగా చెత్త కుప్పలు లేని-చెత్త రహిత గ్రామ పంచాయతీలుగా ప్రకటించడానికి గత నెల 26వ తేదీ నుండి ఈనెల 4వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీలోనూ చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈ గ్రామసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ గ్రామసభలకు హాజరు కావాలని కోరారు.

# ప్రభుత్వాసుపత్రిలో 4.362 కేజీల బరువుగల ఆడ శిశువు జననం..!

-సాధారణ ప్రసవంలో భారీ శిశువు జననం అరుదైన విషయమంటున్న వైద్యాధికారి

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



ప్రభుత్వాసుపత్రిలో జన్మించిన 4.362 కేజీల బరువుగల ఆడ శిశువు

వట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆదివారం 4.362 కేజీల బరువుగల ఆడ శిశువు జన్మించింది. వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి గ్రామానికి చెందిన సురేంద్ర భార్య లత తన 3వకాన్పుకోసం పురిటినొప్పులతో ఆసుపత్రిలో చేరగా కష్టతరమైనా సాధారణ ప్రసవంలో భారీబరువుగల ఆడశిశువు జన్మించగా తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగాఉండి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎన్.వి.ఎస్.చౌదరి 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ 3.5 కేజీల పైబడి బరువు దాటిన శిశువులు సాధారణ ప్రసవం కష్టతరమయ్యే పరిస్థితుల్లో సిజేరియన్ ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. అయితే 4.362 కేజీల బరువుగల ఆడ శిశువు సాధారణ ప్రసవం కావడం అరుదైన విషయమని తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యాధికారి వివరించారు.

# శుద్ధ జల కేంద్రం ప్రారంభం

పరిగి జనవరి 4 (ప్రభాతవార్త):

పరిగి మండలం నేతులపల్లి గ్రామంలో ఎస్టేట్ బుల్ వారి, సి ఎస్ ఆర్, నిధులతో పూర్తిచేసిన శుద్ధ జల కేంద్రాన్ని టిడిపి నాయకులు ఆదివారం ప్రారంభించారు నేతుల పల్లి గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మాకు త్రాగాడా నికి మంచి నీరు లేక చాలా ఇబ్బంద్దులు పడ్డమని సూదురా ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకునే వాళ్ళమని శుద్ధ జలనీటి కేంద్రం లేనందున మంత్రి సవిత చొరవతో ప్రారంభించినందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో ఎస్టేట్బుల్ మేనేజర్ జగదీష్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, బీచ్ గాని పల్లి సర్పంచ్ బాలాజీ,తెలుగు జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, రామంజి, పరిగి సర్పంచ్ లక్ష్మీ శివశంకర్, శాసనకోట ప్రభాకర్, పీవీ నాగరాజు, నేతల పల్లి లోకేష్,గ్రామ ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కార్యక్రమం లో టీడీపీ నాయకులు

# ఆలయాల నిర్మాణానికి డిప్యూటీ ఎంపీడీఓ విరాళం

అయ్యప్ప ఆలయానికి రూ, లక్ష ఇరవై మూడు వేలు షిరిడి సాయి ఆలయానికి రూ, లక్ష 18వేలు అందజేత



అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి నగదును అందజేస్తున్న రావి కుటుంబసభ్యులు

బత్తలపల్లి, జనవరి 4 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వివిధ ఆలయాల నిర్మాణానికి తనవంతుగా డిప్యూటీ ఎంపీడీవో విరాళాలు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లికి చెందిన పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు రావి నారాయణప్ప, రావి వెంకటలక్ష్మమ్మ దంపతుల తనయుడు, తాడిమర్రి మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో రావి విజయ్ శేఖర్ నాయుడు, సతీమణి రావి అరవింద దేవి కుటుంబ సభ్యులు బత్తలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయమునకు రూ, 1,23,116 నగదును గురుస్వామి శెట్టెప్పస్వామికి విరాళంగాఅందజేశారు. అదేవిధంగా బత్తలపల్లిలో నూతనంగా నిర్మించనున్న శ్రీషిరిడిసాయి ఆలయనిర్మాణానికి రూ,1,18,000 నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు శిరిడి సాయి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంపద ఎంత ఉన్న అందరిలో దానగుణం ఉండదని రావి విజయ శేఖర్ నాయుడు కుటుంబ సభ్యులు తన దాతృత్వంతో భక్తి,సేవా భావంతో ఆలయాల నిర్మాణానికి తనవంతుగా ఆర్థిక సహాయం అందించడం పట్ల అభినందిస్తూ దాతలు వీరి ఆదర్శంగా తీసుకొని ఆలయ నిర్మాణాలకు తనవంతుగా చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రావి కుటుంబసభ్యులు కోనంకి హిమజాచౌదరి, కోనంకి శశాంక్,కోనంకి నిహీరా,రావి జస్వంత్, రావి భరత్ లతో పాటు అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు జక్కంపూడి పురుషోత్తంచౌదరి, అక్కిం ప్రతాప్,హోటల్ కుమ్మర శివయ్య, బొమ్మినేని రాము చీమల నారాయణస్వామి,షిరిడిసాయి ఆలయ కమిటీ సభ్యులు బత్తలపల్లి మురళీధర్ రావు, ముల్లగూరు అయ్యప్ప, మదనాపు కొండన్న, తదితరులు పాల్గొన్నారు.



శిరిడి సాయి ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో కుటుంబ సభ్యులు

# మడకశిర నియోజకవర్గ వాల్మీకి ఉద్యోగసంఘ కార్యవర్గం ఎంపిక



ఎన్నికైన వాల్మికి ఉద్యోగ సంఘ కార్యవర్గం

మడకశిర జనవరి 04 ప్రభాతవార్త:

పట్టణం లోని ఆర్ అండ్ బి విశ్రాంతిభవనంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వాల్మీకి ఉద్యోగుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి మడకశిర నియోజకవర్గ వాల్మీకి ఉద్యోగుల సంఘం యొక్క కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. వాల్మీకి ఉద్యోగ సంఘం గౌరవాధ్యక్షులుగా పుట్ట కామప్ప , నియోజకవర్గ సంఘం అధ్యక్షులుగా ఉపాధ్యాయులు జోగప్ప రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యాయులు దేవరాజు, కోశాధికారిగా కె.సి.చంద్రశేఖర్,ఉపాధ్యక్షులుగా అంబరీష్, ఆర్.దేవరాజు, కట్టప్ప,నరేష్ బంగారు లింగలు, కార్యదర్శులుగా హనుమంతరాయప్ప, మంజునాథ్, లిఖిత్,శ్రీనివాసులు, మంజునాథ్‌లు, గౌరవ సలహాదారులుగా ప్రభాకర్, రవికుమార్, వేణుగోపాల్, గోవిందప్పలు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మారుతీ, జగదీష్, శ్రీనివాసులు, జయసూర్య, పృథ్వీరాజ్, మల్లికార్జునలు మరియు ఆడిట్‌సభ్యులుగా ఆంజనేయులు, మల్లికార్జునలను ఎన్నుకొన్నారు. అనంతరం అమరాపురం మండల కమిటీ అధ్యక్షులుగా కాంతరాజు, ప్రధాన కార్యదర్శిగా బోయ శివప్ప లను, గుడిబండ మండల కమిటీ అధ్యక్షులుగా కోదండపాణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసులు, రొల్ల మండల కమిటీ అధ్యక్షులుగా గిరియప్ప, ప్రధాన కార్యదర్శిగా రంగరాజు, ఆగలి మండల అధ్యక్షులుగా హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వీరకాటప్ప మరియు మడకశిర మండలకమిటీఅధ్యక్షులుగా పి.నరేష్,ప్రధాన కార్యదర్శిగా నాగరాజులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వాల్మీకి ఉద్యోగులు మరియు ముఖ్య అతిథులుగా శ్రీసత్యసాయిజిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నారాయణస్వామి, ప్రధానకార్యదర్శి హేమావతి సూర్యనారాయణ, బేగార్లపల్లి నాగరాజు, వై.ప్రభాకర్, జగదీష్,నరేంద్ర,శివయ్య మరియు హిందూపురం, పెనుగొండనియోజకవర్గాల సంఘసభ్యులు అందరూ పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులపై తీవ్ర పని వత్తిడి

సమీక్షలు క్షేత్రస్థాయి సందర్శనలో బిజీ బిజీ

ఉద్యోగంపై అయిష్టత పెంచుకుంటున్న సచివాలయ ఉద్యోగులు

రొళ్ల జనవరి4 ప్రభాతవార్త:




సచివాలయ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉంటున్నారు. ఇటీవల పరిణామాలు వారిని కుంగదీస్తున్నాయి. జీతం చూస్తే స్వల్పం..ఒత్తిడి మాత్రం అధికంగా ఉంటోందని భావిస్తున్నారు.మండల స్థాయి అధికారుల నుంచి గ్రామ స్థాయిలో వీఆర్వో వరకూ వారిపై అన్నిరకాలుగా ఒత్తిడి పెంచుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.సమీక్షలు, క్షేత్రస్థాయిలో పరిశీలనలు అంటూ క్షణం తీరిక లేకుండా గడపాల్సి వస్తోందనీ లోలోపలే మదన పడుతున్నారు.మండల అధికారులు పిలిచిన వెంటనే హాజరుకావాలి. అటు సచివాలయాల్లో రోజు వారీ విధులు నిర్వహించాలి. అసలు తాము ఎవరి పరిధిలో పనిచేస్తున్నామని అర్థం కాని పరిస్థితి నేల్కొందని వాపోతున్నారు.సచివాలయ ఉద్యోగుల్లో ఇంజనీరింగ్, ఎంబీఏ ఎమ్మెస్సీ ,ఏసిఏ డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తిచేసిన వారు సచివాలయ ఉద్యోగాలు దక్కించుకున్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వేలాది రూపాయల జీతాలు వచ్చే అవకాశమున్నా ప్రభుత్వ కొలువుగా భావించి సచివాలయాల్లో చేరిపోయారు.తీరా ఇక్కడకు వచ్చిన తరువాత పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయని పేర్కొంటున్నారు.జీతం చూస్తే మారేడు పని మాత్రం బారేడు చేయాల్సి వస్తుందంటున్నారు.ఏదో ఊహించుకొని వస్తే..ఏదో జరిగిందన్న అత్మనూన్యతా భావం వారిని వెంటాడుతున్నట్లు వాపోతున్నారు.ప్రభుత్వ అస్పష్ట విధానాలతో సచివాలయ ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.అధికారుల ముప్పేట ఒత్తిడితో చాలా మంది ఉద్యోగంపై విసుగు చెందుతున్నారు.తప్పక కొందరు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. కుటుంబసభ్యుల ఒత్తిడితో నెట్టుకొస్తున్నారు. గతప్రభుత్వ అస్పష్టవిధానాలతో సచివాలయ ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారు. గతప్రభుత్వం సచివాలయాల్లో 11 విభాగాలకు సంబంధించి సహాయకులను నియమించింది. అయితే కార్యాలయాల్లో సిబ్బంది నియమించకపోవడంతో ఒకరుఇద్దరిపై తీవ్ర వత్తిడి ఏర్పడుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇంకా ఇటు ఉన్నత అధికారుల ముప్పేట ఒత్తిడితో చాలా మంది ఉద్యోగంపై విసుగు చెందుతున్నారు.తప్పక కొందరు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు.కుటుంబసభ్యుల ఒత్తిడితో నెట్టుకొస్తున్నారు.ఇటీవల రొళ్ల మండలంలో ఒసచివాలయ ఉద్యోగి తమ ఆవేదనను ప్రభాతవార్తతో చెప్పుకున్నారు.ఇటీవల ప్రభుత్వం వారికి పలు బాధ్యతలను అప్పగించడంతో విధులు నిర్వర్తించేకి ఇబ్బంది నెలకొందన్నారు.సంక్షేమ పథకాలు,పౌరసేవల బాధ్యతలతో పనిభారంతో సతమతమవుతున్నట్లు పేర్కొన్నారు.ఉన్నతాధికారుల నుంచి ఎదురవుతున్న ఒత్తిడిని ఇటు స్థానిక సచివాలయ ఉద్యోగులపై మోపుతున్నారు. ఈ పరిస్థితుల్లో చాలామంది ఉద్యోగాల్లో కొనసాగడంపై పునరాలోచనలో పడ్డారు.

# రంగయ్యను పరామర్శించిన ఎంపి బికె.పార్థసారధి

రామగిరి, జనవరి 4 ప్రభాతవార్త



రంగయ్యను పరామర్శిస్తున్న ఎంపి బికె పార్థసారధి

టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కుంటిమద్ది రంగయ్య ను హిందూపురం ఎంపి బికె పార్థసారధి ఆదివారం శ్రీహరిపురంలోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. రంగయ్య కొద్దిరోజుల క్రితం ప్రమదానికి గురై ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విష యం తెలుసుకున్న ఎంపి బికె. పార్థసారధి రంగయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలనిన ఆయన ఆకాంక్షించారు.

# మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు దృశ్యం

అమరాపురం జనవరి 4 ప్రభాతవార్త

మండల పరిధి లోని హేమావతి రోడ్డు లోని కాచి కుంట, ఉదుగూరు గ్రామాల మధ్యలో ఉన్న శ్రీ కరియమ్మ దేవాలయం వద్ద ఆదివారం మాలల ఆత్మీయ సమావే శంను మాల మహా నాడు నాయకులుఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొంకరి కమలమ్మ, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు కోట్ల గంగాధర్, మడకశిర మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, సోమకుమార్, తాలూకా దామోదర్ సంజీవయ్య కమిటీ అధ్యక్షుడు న్యాయ వాది కృష్ణమూర్తి, తాలూకా ఉపాధ్యక్షుడు జయరామప్ప, తాలూకా న్యాయ సలహాదారులు మందలపల్లి బసవరాజ్, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ మాట్లాడు తూ కర్ణాటక సరిహద్దున ఉన్నమడకశిరలో మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య విగ్రహ ఏర్పాటుకు మాల మహానాడు సోదరులు కృషి చేయడం అభినందనీయమన్నారు. దీనికి సహకరించిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఉరుములు కొట్టే వృత్తిలో ఉన్నమాల సోదరుల సమస్యను పరిష్కరించడానికి త్వరలో అనంతపురంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. మడకశిర మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు మాట్లాడుతూ మాలల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. మందలపల్లి బసవరాజ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14న మాజీ ముఖ్యమంత్రిదామోదర్ సంజీవయ్య విగ్రహ ఏర్పాటుకు విగ్రహాన్నిఆమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ తన వంతు సహకారంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశం నందు దామోదర్ సంజీవయ్య విగ్రహ ఏర్పాటు పై చర్చించడంతోపాటు మాల మహా నాడు నాయకుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మరియు వనభోజన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలోమండల మాల సంఘం అధ్యక్షుడు, మండల వైకాపా కార్యదర్శి విరుపసముద్రం నరసింహమూర్తి,మెపా ఉపాధ్యక్షులు కాచికుంట వెంకటేష్, మెపా కార్యదర్శి మల్లికార్జున, మండల ఉపాధ్యక్షులు ఉదుగూరు రాజప్ప, ఎస్సీ సెల్ వైకాపా జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పేలుబండ బసవరాజ్, సీనియర్ నాయకులు పగలి వెంకటస్వామి, పోస్ట్మాస్టర్ మధు, గౌడనకుంట పిఎస్ శ్రీనివాస్, జిల్లాస్థాయి మాల మహానాడు నాయకులు, మాలలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

# మాల మహాసభ జిల్లా కార్యదర్శిగా సురేష్



సురేష్ (ఫైల్‌ఫోటో)

గుత్తి, జనవరి 4 ప్రభాతవార్త

మాల మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తక్కెల సురేష్ ఎన్నికయ్యారు. గుంటూరులో రాష్ట్ర అధ్యక్షులు మల్లెల వెంకట్రావు అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన నియామకం పట్ల జిల్లా అధ్యక్షులు చిన్న నాగప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న వెంకటేశులు, అగ్గిరాముడు, విజయ్‌కుమార్, తదితరులు అభినందించారు.

# శాస్త్రీయ ఆలోచనలతో ముందుకెళ్లాం

ధర్మవరంటౌన్, జనవరి 4 ప్రభాతవార్త



నూతన జేవీవీ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీనాయకులు

జేవీవీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శాస్త్రీ య ఆలోచనలు కలిగి ఉన్నప్పుడే ఈ సమాజం అభివృద్ధి చెందుతుందని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బషీర్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక స్పందన ఆస్పత్రిలో జేవీవీ ముద్రించిన నూతన క్యాలెండర్లను ఆయనతోపాటు జేవీవీనాయకులు ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్‌బషీర్ మాట్లాడుతూ...శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలంటే దాని ప ట్లఅవగాహన కల్గిఉండాలన్నారు. ఆ లక్ష్యంతో పనిచేసినప్పుడే ఆది సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌ఆదిశేషు మాట్లాడుతూ... సైన్స్ సంబంధ అంశాలతో ప్రతి సంవత్సరం జేవీవీరూపొందిస్తున్న క్యాలెండర్ చాలాప్రాచుర్యం పొందిందన్నారు.మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కృషిచేసేసంస్థలలో అగ్రగామిఅని కావున పౌరులు జేవీవీ వేదికలో సభ్యులు కావడంద్వారా సమాజనిర్మాణంలో బాగస్వాములుకావాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రదానకార్యదర్శి లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ విక్రాంత్, జేవీవీనాయకులు సురేష్, ఖలందర్, మనోహర్,సాయిప్రియ,శేషు, హిమజ పాల్గొన్నారు.

# సాఫ్ట్ వేర్ ఉద్యోగం వదిలి పౌల్ట్రీ కోళ్ల పెంపకం

షెడ్డు నిర్మాణం, పౌల్ట్రీ కోళ్లు కొనుగోలు వరకు 29 లక్షలు ఖర్చు

కనగానపల్లి జనవరి 4 ప్రభాతవార్త




షెడ్డులో ఉన్న పౌల్ట్రీ కోళ్లు

దూదేకుల శర్మాస్ వలి.

బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్న దూదేకుల శర్మాస్ వలి వినూత్నంగా ఆలోచన చేసి ఈ రంగంలో అయితే ఒకరే సంపాదించుకోవచ్చు కానీ వ్యాపార రంగంలో అడుగుపెడితే తనతో పాటు పదిమందికి ఉపాధి కల్పించవచ్చని ఆలోచన రావడంతో సాఫ్ట్వేర్ ఉద్యోగం సైతం వదిలి గ్రుడ్ల పౌల్ట్రీ కోళ్లు పెంచాలని నిర్ణయించుకున్నాడు. మండలంలోని తూముచెర్ల గ్రామ సమీపంలో తన మామ ఇచ్చిన పొలంలో 50 సెంట్ల లో కోళ్ల షెడ్ (ఎలివేటెడ్) దీని నిర్మాణం కు 14 లక్షలు ఒక్క స్టోర్ రూమ్, లేబర్, ఒక ఆఫీసు గదులు కాంపౌండ్ నిర్మాణం కు పౌల్ట్రీ కోళ్ల కొనుగోలుకు 15 లక్షలు మొత్తం అంతా కలిపి 29 లక్షలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే బివి 380 రకం గ్రుడ్ల కోళ్లను బెంగళూరు నుండి గుడ్లు పెట్టే వయసు ఉన్న వాటిని ట్రాన్స్పోర్ట్ తో కలిపి 420 రూపాయలు ఒక కోడికి వెచ్చించి 1000 కోళ్లను కొనుగోలు చేసి షెడ్ లో మేపుతున్నామని ఇవి గుడ్లు పెట్టేందుకు దీనికి ప్రత్యేకమైన దాణా వేయాలని ఇవి 14 నెలల వరకు గుడ్లు పెడుతూనే ఉంటాయని సంవత్సరంలో మూడు నెలలకు ఒకసారి వెయ్యి కోళ్లు తెప్పిస్తామని 14 నెలలు వయసు దాటిన కోళ్లను పట్టణాల్లోని చికెన్ సెంటర్లకు కిలో 420 రూపాయల ప్రకారం విక్రయిస్తారు. ఈ గుడ్లను పట్టణాల్లో ఎగ్ సెంటర్లకు ఒక గుడ్డు పది రూపాయలు చొప్పున విక్రయిస్తారు. అలాగే లోకల్ గా తీసుకునే వాళ్లకు ఒక గుడ్డు 12 రూపాయల ప్రకారం విక్రయిస్తారు. కోళ్ల ఖర్చు, దానా, లేబర్ ఖర్చు అన్ని పోను నెలకు దాదాపు రూ 50 వేల వరకు ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. దూదేకుల శర్మాస్ వలి పౌల్ట్రీ పెంపకం నిర్వాహకులు.మాది అనంతపురం నగరం కు చెందిన వాడినని బీటెక్ .సి ఎస్ ఈ. కోర్సు చేశానని 12 సంవత్సరాలుగా బెంగళూరులో క్వెస్ట్ గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సాఫ్ట్వేర్ ఉద్యోగం నెలకు రూ 1.70 లక్ష జీతం వస్తుండేదని ఈ ఉద్యోగంతో అయితే నా కుటుంబం ఒకటే జీవనం సాగిపోతుందని నాతోపాటు పదిమందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంతో తూముచెర్ల లో తన మామ తన భార్యకు ఇచ్చిన పొలంలో ఈ పౌల్ట్రీ కోళ్ల షెడ్డు నిర్మించడం జరిగిందని తెలిపారు.

# రిటైర్డ్ ఆర్టీసి డ్రైవర్ మృతి

గుత్తి, జనవరి 4 ప్రభాతవార్త



నాగభూషణం (ఫైల్‌ఫోటో)

గుత్తి ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన నాగభూషణం (74) ఆదివారం అనారోగ్య కారణంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ సర్పంచు హుస్సేన్‌పీరా, ఆర్టీసి ఉద్యోగులు, తదితరులు తమ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు వెంకటరమణ, తదితరులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

# చుక్కలనంటుతున్న చికెన్ ధరలు..!

-చికెన్ కేజీ ధర రూ.260 చేరిన వైనం -నెల రోజుల్లోనే కేజీపై రూ.60 పెరుగుదల -మాంసాహారానికి దూరమవుతున్న సామన్య ప్రజలు -ఉత్పత్తి తగ్గిపోవడమే కారణమంటున్న వ్యాపారులు -డజను కోడిగుడ్లు రూ.96కు చేరిన పరిస్థితి



ఫారమ్‌లో కోళ్లు



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన చికెన్



ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త

చికెన్ (కోడిమాంసం) ధరలు చుక్కలనంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ చికెన్‌ధర 260 రూపాయలకు చేరింది. గత పక్షం రోజుల క్రితం వరకు కేజీ చికెన్ 200 రూపాయలు ఉండగా ధర ఒక్కసారిగా 60 రూపాయలు పెరిగిపోవడంతో వారానికి ఒక్కరోజు కూడా మాంసాహారం తినలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని సామాన్య, మధ్య తరగతి ప్రజలు అవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల ఇలాగే కొనసాగితే జనవరి నెలాఖరు కల్లా కేజీ చికెన్ ధర 300 రూపాయలకు చేరుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదని తెలుస్తోంది. చికెన్ ధరలు శీతాకాలం మొదలులో పెరగడం సర్వసాధారణమే అయినా జనవరిలో ఇలా పెరిగిన దాఖలాలు తక్కువేనని చెబుతున్నారు. అనంతపురం జిల్లాకు చుట్టుప్రక్కల కోళ్ల ఫారమ్‌లతోపాటు కర్నాటక, తమిళనాడు ప్రాంతాలనుండి కోళ్లు సరఫరా అవుతుండగా క్రిస్మస్ పండుగ రోజు నుండి చికెన్‌కు డిమాండ్ పెరుగగా అందుకు తగ్గట్టు కోళ్లు సరఫరా కాకపోవడంతో ధర అమాంతం పెరుగుతోందని సమాచారం. కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, కోళ్లకు వేసే దాణాలో ప్రధానంగా వినియోగించే మొక్కజొన్న ధర పెరుగడం కూడా చికెన్ ధర పెరుగడానికి కారణమవుతోందని సమాచారం. ధరల పెరుగుదల ఫిబ్రవరి చివరి వరకు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని మార్చి నుండి కోళ్ల ఫారాల్లో కోళ్లు చేతికొచ్చి ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఒక కోడి ఫారాల్లో ఆరోగ్యకరంగా పెరుగాలంటే మూడు నెలల సమయం పడుతుందని అయితే నేడు వాటికి ఇంజక్షన్లు వేసి 45 రోజులకే కోతకు వచ్చేలా చేస్తున్నారని తెలుస్తుండగా కొత్త పంట వచ్చే వరకు ధరలు తగ్గవని అంటున్నారు. కాగా మేక, గొర్రె, పొట్టేలు మాంసం ధరలు అడ్డూ అదుపు లేకుండా ఉరవకొండ ప్రాంతంలో కేజీ 700 రూపాయలు, మరికొన్ని చోట్ల 800 నుంచి 900 రూపాయల వరకు కేజీ ఉండగా పండుగలు, పబ్బాలకు తప్ప మటన్ జోలికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఏ శుభ అశుభ కార్యాలయాలు, విందులకైనా నేడు చికెన్ వైపు నూటికి 90శాతం మంది మొగ్గు చూపుతున్నారు. అయితే చికెన్ సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంటుండగా వాటి ధర పైపైకి ఎగబాకుతుండటంతో మాంసాహార భోజనానికి దూరం కావాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా కోడిగుడ్లు ధరలు సైతం పెరుగుతున్నాయి. రిటైల్ దుకాణాల్లో ఒక్క కోడి గుడ్డు 8 రూపాయలు ధర ఉండగా డజను కోడిగుడ్లు దాదాపు 96 రూపాయలకు చేరుకున్నాయి. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు ఇటు చికెన్ కోడిగుడ్ల ధరతోపాటు మాంసం ధరలకు కళ్లెం వేయడానికి తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

